E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 17-05-2025 (వారం) శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




హైదరాబాద్‌లో నకిలీ భూపత్రాలు సృష్టించి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్ » 2లో

# ఫ్యూచర్‌సిటీలో విద్యుత్ లైన్లు అన్నీ భూగర్భంలోనే: సీఎం రేవంత్



- 2034–35 నాటికి 31,808 మెగావాట్లకు డిమాండ్
- అందుకు తగినట్లుగా ఉత్పత్తికి ప్రణాళికలు వేయండి
- క్లీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజీ, ఫ్లోటింగ్ సోలార్‌పై దృష్టి పెట్టాలి
- ఓఆర్ఆర్ పొడవునా సోలార్ లైటింగ్ ఏర్పాటు చేయండి
- సచివాలయం, నెక్లెస్‌రోడ్, కేబీఆర్ పార్క్‌లో స్మార్ట్ పోల్స్
- విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఈ కబురు ,: రాష్ట్రంలో ఐటీ, పారిశ్రామిక అభివృద్ధితోపాటు గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో విద్యుత్‌కు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని ఇంధన శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా తరలి వస్తున్నాయని, భవిష్యత్‌లో పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు తయారు చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. సీఎం శుక్రవారం తన నివాసంలో ఇంధన శాఖపై డిప్యూటీ సీఎం భట్టితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, ప్రజా రవాణా (మెట్రో, ఎలక్ట్రికల్ వెహికిల్స్) పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు.

తరువాయి 2లో



## ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఇదే ఒరిజినల్ సిటీ

"ఈ -కబురు ,: తెలంగాణలోని మైనారిటీ వర్గాల అభివృద్ధి, విద్య, ఉపాధి రంగాల్లో అవసరమైన మేరకు ఆదుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ముస్లింలలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాల్లో వారి జనాభా మేరకు అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. హజ్ యాత్రికుల సౌకర్యార్థం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని మామిడిపల్లిలో వసతి భవనం (రూబత్) నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు."

తరువాయి 2లో



మొదటి ప్రయోగ వేదికపై పీఎస్ఎల్వీ-సి61

## 18న ఇస్రో 101వ రాకెట్ ప్రయోగం

*ఈ ఏడాది జనవరిలో 100 రాకెట్ ప్రయోగాల మైలురాయిని అందుకున్న ఇస్రో తర్వాతి రాకెట్ లాంచ్‌కు సిద్ధమవుతోంది.*

*ఈ -కబురు : శ్రీహరికోట, వడపళని - : ఈ ఏడాది జనవరిలో 100 రాకెట్ ప్రయోగాల మైలురాయిని అందుకున్న ఇస్రో తర్వాతి రాకెట్ లాంచ్‌కు సిద్ధమవుతోంది.*

తరువాయి 2లో

## బావ బావమరిది రెండు గంటల డిస్కషన్.. పార్టీ పగ్గాలపైనే చర్చించినట్టు టాక్.!

- హరీశ్ ఇంటికి వెళ్లిన కేటీఆర్
- పార్టీ పగ్గాలపైనే చర్చించినట్టు టాక్




ఈ కబురు ,హైదరాబాద్: బీఆర్ఎస్ లో కీలక పరిణామం చోటు చేసుకుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మాజీ మంత్రి హరీశ్ రావు ఇంటికి వెళ్లారు. ఆయనతో రెండు గంటల పాటు భేటీ అయ్యారు. ఇటీవలే హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ కు పార్టీ పగ్గాలు ఇస్తే స్వాగతిస్తానని కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. కేసీఆర్ ఏ బాధ్యత అప్పగించినా చేసేందుకు తాను సిద్ధ:గా ఉన్నానంటూ క్లారిటీ ఇచ్చారు. ఆయన ఈ వ్యాఖ్యలు చేసిన 48 గంటల తర్వాత స్వయంగా కేటీఆర్ హరీశ్ ఇంటికి వెళ్లడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ సాయంత్రం మాజీ సీఎం కేసీఆర్ తనయ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికా వెళ్తున్నారు. తన కుమారుడి గ్రాడ్యుయేషన్ సెర్మనీ కోసం ఆమె భర్తతో కలిసి యూఎస్ వెళ్తున్నారు. ఇదే సమయంలో గులాబీ పార్టీలోని కీలక నేతలు భేటీ కావడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

తరువాయి 2లో

90 మీటర్ల మార్క్‌ను దాటేశాడు.. చరిత్ర సృష్టించిన నీరజ్ చోప్రా » 6లో




ఆదాయపు పన్ను రిటర్నులకు సిద్ధమా? » 4లో




అల్లు అర్జున్‌తో లవ్‌స్టోరీ........ మహేశ్‌బాబుతో మైథలాజికల్: నిహారిక » 5లో



## పిల్లల మర్రిలో అందాల భామల సందడి



మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రిలో మిస్ వరల్డ్ పోటీదారులు శుక్రవారం నాడు సందడి చేశారు. అక్కడి పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. అందాల భామలకు జిల్లా యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికింది.

*ఈ -కబురు , మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రిలో ఇవాళ(శుక్రవారం) మిస్ వరల్డ్ పోటీదారులు పర్యటించారు. వారికి సంప్రదాయ నృత్యాలతో కళాకారులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి, మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, జీఎంఆర్, వీర్లపల్లి శంకర్, చిట్టెం పర్ణికారెడ్డి పాల్గొన్నారు. 16వ శతాబ్దం నాటి రాజరాజేశ్వర సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ విశిష్టతను మిస్ వరల్డ్ పోటీదారులకు చరిత్రకారుడు శివ నాగిరెడ్డి వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో సేకరించిన పలు విగ్రహాల విశిష్టత గురించి తెలిపారు. అలాగే జిల్లా మ్యూజియాన్ని మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. బతుకమ్మలతో వారికి ఘన స్వాగతం పలికారు. స్థానిక మహిళలతో కలిసి పోటీదారులు బతుకమ్మ ఆడారు. పిల్లలమర్రి మహావృక్షం చరిత్ర, విశిష్టతను అటవీశాఖ అధికారి మిస్ వరల్డ్ పోటీదారులకు వివరించారు. డీహైడ్రేషన్‌తో కాస్తా అస్వస్థతకు మిస్ వరల్డ్ చైనా కంటెస్టెంట్ గురయ్యారు.*

» 2లో


## నా వ్యాఖ్యలను వక్రీకరించారు: మంత్రి కొండా సురేఖ



వరంగల్‌లో ఓ అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ సందర్భంగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి.

» 2లో

## ఆపరేషన్ సిందూర్.. పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి కేంద్రం నో..!



ఆపరేషన్ సిందూర్‌పై చర్చ కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిరాసక్తత చూపిస్తున్నట్లు సమాచారం.

» 3లో

## ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్ కీలక ప్రకటన ..



జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు.

» 3లో

## ఎందుకు ఆలస్యం?



- రాష్ట్రవ్యాప్తంగా అనేక సెంటర్లలో కుప్పలుగా వడ్ల రాశులు..
- కొన్నిచోట్ల లారీలు లేవంటూ కాంటా వేసేందుకూ నిరాకరిస్తున్న నిర్వాహకులు
- కొన్న ధాన్యం తరలింపులోనూ రోజుల తరబడి జాప్యం..
- ట్రాక్టర్ల ద్వారా తరలించుకుంటామంటే హమాలీలు లేరంటున్న వైనం
- ఈ యాసంగిలో దాదాపు 1.30 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- అన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా తప్పిన ప్రణాళిక!
- ఇప్పటివరకు మొత్తం 51.39 ఎల్ఎంటీల ధాన్యం సేకరణ
- సుమారు 10 ఎల్ఎంటీల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్నట్లు అంచనా
- అకాల వర్షా లు, ముందస్తు రుతుపవనాల వార్తలతో ఆందోళనలో రైతులు

ఈ కబురు : ఓవైపు నైరుతి రుతుపవనాలు ముంచుకొస్తున్నాయి. మరోవైపు యాసంగి సీజన్‌లో వచ్చిన అధిక దిగుబడితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాశులతో నిండిపోయాయి. నెల రోజులుగా కొనుగోళ్లు సాగుతున్నప్పటికీ.. ఇప్పటికీ చాలా జిల్లా ల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు దర్శనమిస్తున్నాయి. 10 నుంచి 20 రోజుల పాటు ఎదురు చూసినా వడ్ల బస్తాలను కాంటా వేయడం లేదని రైతులు వాపోతున్నారు. కొన్న ధాన్యం తరలించేందుకు లారీలు లేవని, రైతులు సొంతంగా ట్రాక్టర్‌లో తీసుకెళ్తామంటే హమాలీలు లేరని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. ధాన్యం రాశుల వద్ద రోజుల తరబడి పడిగాపులు పడుతున్నారు. మరిపెడ మండలంలోని ఓ రైతు 600 బస్తాలకు కాంటా వేయించిన తర్వాత లారీలు లేవనే సాకుతో కేంద్రంలోనే వదిలేశారు. ఇప్పటికే అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచగా.. మరోవైపు ముంచుకొస్తున్న వానాకాలం అన్నదాతలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం సుమారు 10 ఎల్ఎంటీల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా పడి ఉన్నట్లు అంచనా.

**ఇప్పటివరకు 51.39 ఎల్ఎంటీల కొనుగోలు**

రాష్ట్రంలో ఈసారి యాసంగి సీజన్‌లో 60.14 లక్షల ఎకరాల్లో వరి సాగయింది. దాదాపుగా 1.30 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఇందులో 70.13 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. కాగా శుక్రవారం వరకు తెరిచిన

తరువాయి 3లో

## అంతర్జాతీయ సమాజం దృష్టికి పాక్ ఉగ్ర కుట్రలు తీసుకెళ్లే యోచనలో భారత్!



ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని ప్రపంచ దేశాలకు వివరించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఈ -కబురు : ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై భారత్ ఇప్పటికే దౌత్య చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ తర్వాత దాయాది పై ద్వైపాక్షికంగా ఒత్తిడి తెచ్చేందుకు భారత్ సిద్ధమైంది. ఈ క్రమంలోనే కేంద్రం పలు దేశాల రాయబారులు, విదేశాంగ మంత్రులకు ప్రత్యేక బ్రీఫింగ్ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ఉగ్రవాదంపై పాకిస్థాన్ పోషిస్తున్న పాత్రపై న్యూఢిల్లీ వైఖరిని అంతర్జాతీయ సమాజానికి స్పష్టం చేయడానికి విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

తరువాయి 3లో



## ట్యాంక్‌బండ్‌పై తిరంగా యాత్ర.. పాల్గొనాలని ప్రజలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు

ప్రధాని మోదీ ఉగ్రవాదుల అంతు చూస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

*ఈ -కబురు ,హైదరాబాద్: ప్రధాని మోదీ ఉగ్రవాదుల అంతు చూస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పాక్‌తో పోరులో భారత సైన్యం చరిత్ర రాసే ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. భారత్‌పై దాడి చేస్తే ప్రతిదాడి ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్ ద్వారా నిరూపించామని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భాజపా నిర్వహించే తిరంగా యాత్రలో అందరూ పాల్గొనాలని కోరారు.*

తరువాయి 3లో

మొదటి పేజీ తరువాయి

# ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఇదే ఒరిజినల్ సిటీ



ముస్లింలు జీవితంలో ఒక్కసారైనా హజ్‌కు వెళ్లి ప్రార్థనలు చేయాలని అనుకుంటారని, ఈసారి ప్రభుత్వానికి 6 వేల దరఖాస్తులు అందితే వాటన్నింటినీ ఆమోదించినట్టు చెప్పారు. హజ్ యాత్రికులకు వీడ్కోలు పలుకుతూ విమానాశ్రయం బయలుదేరిన బస్సులకు నాంపల్లి హజ్ హౌజ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. యాత్రికులకు శుభాభినందనలు తెలియజేశారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి హజ్‌కు వెళ్లే హాజీల కోసం అవసరమైన ఏర్పాట్లు చేశారని, ప్రభుత్వం అందుకు అన్ని విధాలుగా సహకరించిందని చెప్పారు. "హజ్‌కు వెళ్లడం మీ హక్కు. ఈ విషయంలో ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుంది. మీకు అవసరమైన ఏర్పాట్లు చేయడం మా బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడంలో వెనుకడుగు వేయమని" అన్నారు. ఈ వేదిక నుంచి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ లేవనెత్తిన అంశాలను రేవంత్ రెడ్డి ప్రస్తావిస్తూ, ఇది ఓల్డ్ సిటీ కాదు. ఇదే ఒరిజినల్ సిటీ అని ఇదివరకు ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఒరిజినల్ సిటీ అభివృద్ధి కోసం ఎంపీ అడిగిన దానికన్నా ఎక్కువగానే దాదాపు 2 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మెట్రో విస్తరణ, రోడ్ల నిర్మాణం, మిరాలం ట్యాంక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం వంటి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న విషయాన్ని గుర్తుచేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి సంక్షేమ పథకాల్లో తగిన వాటా మేరకు ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాజీవ్ యువ వికాసం కింద అర్హులైన ముస్లిం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. "హజ్‌కు వెళుతున్న యాత్రికులు ఈ దేశం కోసం, ఈ రాష్ట్రం కోసం, ప్రజల శాంతియుత జీవనం కోసం అల్లాను ప్రార్థించండి. హజ్ యాత్రికుల కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా అండదండలు అందిస్తుంది. భవిష్యత్తులోనూ మీ నుంచి వచ్చే అభ్యర్థనల విషయంలోనూ ప్రభుత్వం చేయగలిగినంత సహాయం చేస్తుంది. అది మా బాధ్యత" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ప్రజా ప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, హజ్ కమిటీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు





మొదటి పేజీ తరువాయి

# ఫ్యూచర్‌సిటీలో విద్యుత్ లైన్లు అన్నీ భూగర్భంలోనే: సీఎం రేవంత్



**9.8 శాతం పెరిగిన విద్యుత్ డిమాండ్..**

గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందని సీఎం తెలిపారు. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో వినియోగం పెరగలేదని, అయినా అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఈ ఏడాది అత్యధిక విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరినాటికి అది 18,138 మెగావాట్లకు, 2034-35 నాటికి 31,808 మెగావాట్లకు పెరుగుతుందని అధికారులు సీఎంకు వివరించారు. దీంతో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాలని సీఎం సూచించారు. ప్రధానంగా క్లీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజీపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కొత్తగా అమల్లోకి తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీపై దృష్టి సారించాలని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో దిగ్గజ సంస్థలకు రాష్ట్రంలో అవకాశం ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని.. మెట్రో విస్తరణ, రైల్వే లైన్లు, ఇతర మాస్ ట్రాన్స్‌పోర్ట్‌లకు విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు ఇతర కార్పొరేషన్లు, కొత్తగా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.

**హెచ్ఎండీఏతో సమన్వయం..**

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) వరకు రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్‌లకు విద్యుత్ అవసరాలపై హెచ్ఎండీఏతో సమన్వయం చేసుకోవాలని విద్యుత్తు శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. క్షేత్రస్థాయిలో డిమాండ్‌కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలని, విద్యుత్ లైన్ల ఆధునీకరణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్లు బహిరంగంగా కనిపించడానికి వీల్లేదని, హై టెన్షన్ లైన్లను కూడా అక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయం, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో ముందుగా వీటిని ఏర్పాటుచేయాలని ఆదేశించారు. 160 కిలోమీటర్ల ఓఆర్ఆర్ పొడవునా సోలార్ విద్యుత్ లైటింగ్‌ను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఫుట్‌పాత్‌లు, నాలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

# బావ బావమరిది రెండు గంటల డిస్కషన్..

## పార్టీ పగ్గాలపైనే చర్చించినట్టు టాక్.!

**ఆధిపత్య పోరు**

బీఆర్ఎస్ పార్టీలో కొంతకాలంగా ఆధిపత్యపోరు కొనసాగుతోంది. ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభల పర్యవేక్షణ బాధ్యతలను తొలుత హరీశ్ కు అప్పగించారు కేసీఆర్. తర్వాత ఆయనను తప్పించారు. సీన్లోకి కేటీఆర్, కవిత ఎంట్రీ ఇచ్చారు. ఈ క్రమంలో ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. దీంతో హరీశ్ రావు పార్టీ మారుతారనే ప్రచారం ఊపందుకుంది. తాను ఏ పార్టీలోకి వెళ్లడం లేదని మీడియా ముఖంగా క్లారిటీ ఇచ్చారు. తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై లీగల్ చర్యలకు దిగుతానని కూడా హెచ్చరించారు. అదే సందర్భంగా కేటీఆర్ కు బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తానని అన్నారు. కేసీఆర్ మాటే శిరోధార్యం అని, ఆయనతో చివరివరకు ఉంటానని తెగేసి చెప్పారు. ఆయన లైన్ లోనే కొనసాగుతానని పార్టీ మార్పు వార్తలను ఖండించారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ కవిత తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆమె ఇటీవలే చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా చర్చకు వస్తున్నాయి. హరీశ్ రావు ప్రెస్ మీట్ కు ఒక రోజు ముందే అంటే ఈ నెల 12న కవిత మాట్లాడుతూ.. ఆరునెలలు జైల్లో ఉన్నది చాలదా..? ఇంకా ఎన్ని రోజులు కష్టపెడతారంటూ కామెంట్ చేశారు. కొందరు తనపై పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని, సమయం వచ్చినప్పుడు అన్నీ బయటపడ్తాయంటూ కామెంట్ చేశారు. కవితను కష్టపెడుతున్నది ఎవరు అన్న చర్చ జరుగుతున్న తరుణంలోనే మరుసటి రోజు హరీశ్ రావు ప్రెస్ మీట్ పెట్టి కేటీఆర్ కు బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తానని చెప్పడం గమనార్హం. ఇది జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా హరీశ్ రావు ఇంటికి వెళ్లడం, రెండు గంటల పాటు భేటీ కావడం హాట్ టాపిక్ గా మారింది.



మొదటి పేజీ తరువాయి

# 18న ఇస్రో 101వ రాకెట్ ప్రయోగం

**మొదటి ప్రయోగ వేదికపై పీఎస్ఎల్వీ-సి61**



ఈ నెల 18 (ఆదివారం)న శ్రీహరికోటలోని షార్ నుంచి పీఎస్ఎల్వీసి61ను ప్రయోగించనుండగా ఇది ఇస్రోకు 101వ రాకెట్ ప్రయోగం కానుంది. దీని ద్వారా భూ పరిశీలన ఉపగ్రహం (ఈఓఎస్) రిశాట్ 18ను కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. శనివారం ఉదయం 7.59 గంటలకు ఈ మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. నిరంతరాయంగా 22 గంటలపాటు కొనసాగిన తర్వాత ఆదివారం ఉదయం 5:59 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ప్రయోగ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి ఇస్రో అధిపతి నారాయణన్ గురువారం షార్‌కు చేరుకున్నారు. అంతకుముందు ఆయన చెన్నైలో మాట్లాడుతూ.. దేశ భద్రత, ప్రజల అవసరాలే ప్రధాన లక్ష్యంగా ఇస్రో ప్రయోగాలు చేపడుతుందని, ఇతర దేశాలతో పోటీ పడదని పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# నా వ్యాఖ్యలను వక్రీకరించారు: మంత్రి కొండా సురేఖ



ఈ కబురు ,వరంగల్: ఓ అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ సందర్భంగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. వరంగల్‌లోని కృష్ణా కాలనీలో బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.4.5కోట్లతో భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. "క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి. మామూలుగా మంత్రులు అలాంటి ఫైల్స్ వచ్చినప్పుడు డబ్బులు తీసుకుని క్లియరెన్స్ ఇస్తుంటారు. మేం మాత్రం మాకు నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు.. సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం" అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. తన వ్యాఖ్యలు కలకలం సృష్టించడంతో కొండా సురేఖ వివరణ ఇచ్చారు. భారాస ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు. ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారని అన్నానని తెలిపారు.




# హైదరాబాద్‌లో నకిలీ భూపత్రాలు సృష్టించి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

**నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ అక్రమ దందాకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు.**

ఈ కబురు , హైదరాబాద్: నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ అక్రమ దందాకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురిని అరెస్టు చేయగా.. మరో ఏడుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. భానుప్రకాశ్, సాగరిక దంపతులు సరూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సాత్విక్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో నోటరీ షాపు నిర్వహిస్తున్నారు. అధిక డబ్బుల కోసం ఆశపడి నకిలీ బర్త్, ఇన్‌కమ్, క్యాస్ట్ సహా భూమి క్రయవిక్రయాలకు సంబంధించిన ఫేక్ డాక్యుమెంట్లు, ఫోర్జరీ పత్రాలు సృష్టించే వారని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఇందుకోసం నిందితులు కొందరు వ్యక్తులతో చేతులు కలిపి ఓ వ్యవస్థనే ఏర్పాటు చేశారని వెల్లడించారు. గత తొమ్మిదేళ్లుగా ఈ దందా సాగుతున్నట్లు గుర్తించామన్న సీపీ.. ఒక్కో నకిలీ డాక్యుమెంట్‌ను రూ.5వేల నుంచి రూ.20వేల వరకు విక్రయిస్తున్నారని వివరించారు.

# పిల్లల మర్రిలో అందాల భామల సందడి

ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌ను సందర్శించిన అందాల భామలు.. హైదరాబాద్ శివారులోని ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌ను మిస్ వరల్డ్ 2024 ఘన విజేత చెక్ రిపబ్లిక్ క్రిస్టినా పిష్కోవాతో పాటు అమెరికా ఖండ ఓసియానియా మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు శుక్రవారం సాయంత్రం సందర్శించారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లకు ఎక్స్‌పీరియం పార్క్ వద్ద డోల్ వాయిద్యం, గజ్జెలతో సాంప్రదాయంగా స్వాగతం పలికారు. పోటీదారులు ఉత్సాహంగా నృత్యం చేస్తూ ఈ సందర్శనలో భాగస్వాములు అయ్యారు. అధికారులు వాహనాల్లో వారిని తీసుకువెళ్లి ఎక్స్‌పీరియం పార్క్ ప్రదేశాలను చూపించారు. ఈ సందర్శనలో మిస్ వరల్డ్ పోటీదారులకు హైదరాబాద్ పర్యావరణ సమతుల్యత, స్థిరమైన అభివృద్ధి ప్రయత్నాలను అధికారులు వివరించారు. ఎక్స్‌పీరియం ఏకో పార్లో గ్రీన్ టెక్నాలజీ, పర్యావరణ పరిరక్షణ, స్థానిక జీవవైవిధ్యం, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. పార్క్‌లోని ప్రకృతి సౌందర్యం, హరిత విహార ప్రాంతాలను పోటీదారులు సందర్శించారు. అద్భుతమైన సూర్యాస్తమయ దృశ్యాలను అందించే ప్రదేశం సండౌనర్ పాయింట్ , ప్రకృతి, ఆధ్యాత్మికత శాంతియుత సంగమం బుద్ధ ఇన్‌సైడ్ ట్రీ స్పాట్ , భూగర్భ శాస్త్రపరమైన అద్భుతం, రెడ్ టైల్ ఫార్మేషన్ స్పాట్, అపూర్వమైన ప్రకృతి ఛాయావృత ప్రదేశం ఓవల్/అంబ్రెలా ఆకారపు చెట్టు స్పాట్, హైటీ, డీజే సెషన్‌తో కూడిన రౌండ్ టేబుల్, ఈజిప్షియన్ రాక్ స్పాట్‌ను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. పార్క్ అందాలను వీక్షించిన మిస్ వరల్డ్ పోటీదారులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

**ఎక్స్‌పీరియం పార్క్ గురించి అందాల భామలు ఏమన్నారంటే...**

మిస్ కెనడా, ఎమ్మా మోరిసన్: ఎక్స్‌పీరియం పార్క్ చాలా అద్భుతంగా ఉంది. నా తల్లిదండ్రులు త్వరలో హైదరాబాద్‌కు వస్తున్నారు. ఎక్స్‌పీరియం పార్క్‌ను వారికి కూడా చూపిస్తాను. మిస్ యుఎస్, అథెనా క్రాస్బీ: భూమిని రక్షించడం మన బాధ్యత. ఎక్స్‌పీరియం పార్క్, సృజనాత్మక డిజైన్ ద్వారా ప్రకృతితో ఎలా సామరస్యంగా జీవించవచ్చో చూపిస్తుంది. మిస్ బ్రెజిల్, జెస్సికా పెడ్రోసో: ఎక్స్‌పీరియం పార్క్ చాలా బాగుంది. మా దేశాలు కూడా ఇలాంటి పార్కులను ప్రోత్సహించాలి. మిస్ గయానా, జలీకా సామ్యూల్స్: ఎక్స్‌పీరియం పార్క్ ప్రకృతిని సంరక్షిస్తూ, అద్భుతాలను సృష్టిస్తోంది. ఎక్స్‌పీరియం పార్క్ ఎంతో బాగుంది. పర్యావరణ అవగాహన, సంస్కృతి, స్థిరత్వాన్ని ప్రోత్సహించే ఒక మార్గదర్శకంగా ఈ పార్క్ నిలిచింది. మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణకు తీసుకురావడంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ప్రపంచంలోని 22 దేశాల మిస్ వరల్డ్ పోటీ దారులు పిల్లలమర్రి వృక్షాన్ని సందర్శించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ప్రముఖ సాధుసంతులు, విద్యావేత్తలు పిల్లలమర్రి మహావృక్షం సందర్శించి జ్ఞానం పొందారని చరిత్ర చెబుతోందని అన్నారు ఇక్కడ మర్రి మహావృక్షం, ప్రముఖ దేవాలయాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. మిస్ వరల్డ్ పోటీలు అయిపోయిన వెంటనే తెలంగాణలోని చారిత్రాత్మక స్థలాలు, అద్భుతమైన దేవాలయాలు, ప్రముఖ పర్యాటక కేంద్రాలను మిస్ వరల్డ్ పోటీదారులు ప్రత్యేకంగా చూడాలని కోరారు. మిస్ వరల్డ్ పోటీ దారులు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాలని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీ దారులు తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేసేందుకు అంబాసిడర్లుగా తాము గౌరవిస్తున్నామని అన్నారు. మిస్ వరల్డ్ పోటీదారులు పిల్లలమర్రికి వచ్చినందుకు ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పిల్లలమర్రి 700 సంవత్సరాల నాటిదని.. ఈ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. మరో 700 సంవత్సరాల పాటు ఇలాగే ఉండాలని ఆశిస్తున్నామని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను మిస్ వరల్డ్ పోటీదారులు తెలుసుకున్నారని చెప్పారు. ఈ జ్ఞాపకాలను ప్రపంచానికి చాటి చెబుతారని ఆశిస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు






## ఆపరేషన్ సిందూర్.. పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి కేంద్రం నో..!

ఈ కబురు ,ఢిల్లీ: పహల్గాం దాడి అనంతరం నెలకొన్న భారత్‌పాక్ ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ పై చర్చించేందుకు పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ఇందుకు కేంద్రం నిరాసక్తత కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్రం సముఖంగా లేదని సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఏడాది జులైలో జరిగే వర్షాకాల సమావేశాల్లోనే ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పనుంది. పహల్గాం దాడి అనంతరం జరిగిన పరిణామాలు, కలసికట్టుగా తీసుకున్న నిర్ణయాలను చర్చించేందుకు పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల ప్రధాని మోదీకి లేఖ రాశారు. ''ఐక్యత, సంఘీభావం అవసరమైన ఈ తరుణంలో, వీలైనంత త్వరగా ఉభయ సభల్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేయడం ముఖ్యమని విపక్షం భావిస్తోంది'' అని రాహుల్ పేర్కొన్నారు. వీరితో పాటు మరికొందరు విపక్ష ఎంపీలు సైతం ఇదే డిమాండ్ వినిపించారు.

**పాక్‌కు ఎరేసి ఉచ్చులోకి లాగిన భారత్.. ఆ తర్వాత ఏం జరిగిందో తెలుసా..?**

అయితే, విపక్షాల డిమాండ్‌ను భాజపా నేతలు తోసిపుచ్చారు. ప్రస్తుతం ఆపరేషన్ సిందూర్ తాత్కాలికంగానే నిలిచిందని, ఈ సమయంలో అనవసర చర్చలకు తావివ్వొద్దని ప్రతిపక్షాలను దుయ్యబట్టారు. ఆపరేషన్ సిందూర్ ముగిసిన తర్వాత ప్రత్యేక సమావేశం డిమాండ్‌ను లేవనెత్తాలని సూచించారు. ఈ క్రమంలోనే కేంద్రం కూడా దీనిపై సుముఖంగా లేనట్లు తాజాగా వార్తలు వినిపిస్తున్నాయి. జులైలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి.



## అంతర్జాతీయ సమాజం దృష్టికి పాక్ ఉగ్ర కుట్రలు తీసుకెళ్లే యోచనలో భారత్!

అందుకోసం వివిధ రాజకీయ పార్టీలతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రతి ప్రతినిధి బృందంలో 56 మంది ఎంపీలు, ఒక విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారి, ప్రభుత్వ ప్రతినిధి ఉంటారు. మొత్తం ఎనిమిది గ్రూపులు 10 రోజుల వ్యవధిలో ఐదు దేశాలకు వెళ్తాయి. ఈ బృందాలకు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ నేతృత్వం వహించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. వీరు మే 22న భారతదేశం నుంచి వివిధ దేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని.. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. వారు ముఖ్యంగా ఐదు అంశాలకు ప్రపంచ దేశాలకు వివరిస్తారు.

ఆపరేషన్ సిందూర్.. రక్షణ బడ్జెట్ రూ.50వేల కోట్ల పెంపు..!

1. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు
2. పాక్ బెదిరింపులకు ధీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరణ
3. భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత
4. ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే కచ్చితంగా లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం
5. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ..ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్ అనుసరిస్తున్న పాత్రను.. దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును వివరించడం ఈ విషయం గురించి కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీలతో చర్చలు జరుపుతోందని.. త్వరలో ఈ బృందాలను ఏర్పాటుచేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. సరిహద్దు ఉగ్రవాదం అంశంపై దేశ ఐక్యతను ప్రదర్శించడానికి చేసే ఒక సమష్టి ప్రయత్నంగా దీనిని అభివర్ణించాయి. ఈ బృందాలు విదేశీ ప్రభుత్వాలు, రక్షణ అధికారులు, మీడియా సంస్థలతో చర్చలు జరపనున్నట్లు తెలిపారు. గతంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు.. అటల్ బిహారీ వాజ్‌పేయిని ఎన్‌హెచ్‌ఆర్‌సీకి కి పంపడం వంటి విషయాలను ఆదర్శంగా తీసుకొని ఈ చర్యలకు సమాయత్తమవుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. నాడు వాజ్‌పేయిని ఐరాసకు పంపిన పీవీ.. 1994లో భారత్ పాకిస్థాన్ తీవ్ర ఉద్రిక్తతలను ఎదుర్కొన్న సమయంలో జమ్మూకశ్మీర్‌లో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి ఇస్లామాబాద్.. యూఎన్ మానవ హక్కుల కమిషన్ లో ఒక తీర్మానాన్ని సమర్పించడానికి సిద్ధమయ్యింది. దీంతో అప్పటి భారత ప్రధాని పీవీ నరసింహారావు పాక్‌పై దౌత్య వ్యూహాన్ని అమలుచేశారు. ఇరుదేశాల మధ్య పరిస్థితులను అక్కడి అధికారులకు వివరించడానికి ఐరాస వద్దకు భారత్ నుంచి బహుళ పార్టీల ప్రతినిధుల బృందాన్ని పంపారు. దీనికి దివంగత భాజపా నేత అటల్ బిహారీ వాజ్‌పేయా నాయకత్వం వహించారు. అప్పటి విదేశాంగ సహాయ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, ఫరూక్ అబ్దుల్లా ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఆ సమయంలో యూఎన్‌లో భారత రాయబారిగా ఉన్న హమీద్ అన్సారీ కూడా కీలక పాత్ర పోషించారు. వీరంతా కలిసి యూఎన్‌లో పాకిస్థాన్ ఆరోపణలను సమర్థవంతంగా ఎందుర్కొంటూ.. ఆ దేశం చేసిన తీర్మానాన్ని సమర్థవంతంగా పరిష్కరించారు. దీంతో ఇస్లామాబాద్ తన తీర్మానాన్ని ఉపసంహరించుకుంది.





**పాకిస్థాన్‌తో సైనిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టిన వేళ రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం గుజరాత్‌లోని భుజ్ వైమానిక స్థావరాన్ని సందర్శించారు.**

## 23 నిమిషాల్లో పాక్‌కు చుక్కలు చూపించాం

ఈ కబురు , భుజ్: పాకిస్థాన్‌తో సైనిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టిన వేళ రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం గుజరాత్‌లోని భుజ్ వైమానిక స్థావరాన్ని సందర్శించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో సైనికులపై ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. పాకిస్థాన్ ఎన్నోఏళ్లుగా పెంచి..పోషిస్తున్న ఉగ్రవాదాన్ని భారత సైన్యం కేవలం 23 నిమిషాల్లో తుడిచి పెట్టేసిందన్నారు. మన సైనికుల పరాక్రమం చూసి దేశ, విదేశాల్లోని భారతీయులు గర్విస్తున్నారని తెలిపారు. మన బ్రహ్మోస్ క్షిపణి శక్తిని దాయాది దేశం కూడా అంగీకరించిందని పేర్కొన్నారు. ప్రస్తుత సమయంలో పాకిస్థాన్‌కు సాయంపై ఐఎంఎఫ్ పునరాలోచించాలని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ కోరారు. ఐఎంఎఫ్ ఆర్థిక సాయాన్ని ఉగ్రవాదానికి మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు ఉపయోగిస్తారని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు రూ.14 కోట్ల ఇస్తున్నట్లు పాక్ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.భారత్ పాకిస్థాన్ కాల్పుల విరమణపై రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. ''అటువైపు నుంచి ఎలాంటి ఘర్షణలు తలెత్తకపోతే మంచిదే. కానీ కాల్పుల విమరణ ఉల్లంఘన జరిగితే వారికి కఠినమైన శిక్ష తప్పదు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిసిపోలేదు. ఇప్పటివరకు జరిగింది కేవలం ట్రైలర్ మాత్రమే. సరైన సమయంలో పూర్తి సినిమా చూపిస్తాం'' అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ రాజకీయ సంకల్పానికి, మన నిఘా సంస్థల కచ్చితమైన సమాచార సేకరణకు, త్రివిధ దళాల అసమాన పోరాట పటిమకు ఆపరేషన్ సిందూర్ విశిష్ట తార్కారణమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో నేతృత్వంలో నిఘా సంస్థల మధ్య సమాచారాన్ని పంచుకునేందుకు ఉద్దేశించిన బహుళ సంస్థల కేంద్రాన్ని (మల్టీ ఏజెన్సీ సెంటర్) ఉన్నతీకరించారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన దీనిని ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ సైన్యం, వాయుసేన, నౌకాదళాలతోపాటు బీఎస్ఎఫ్ సహా భద్రత సంస్థలన్నీ దేశానికి రక్షాకారణమన్నారు. మావోయిస్టుల ఏరివేతలో మాదిరిగానే ఆపరేషన్ సిందూర్‌లోనూ దళాలమధ్య చక్కని సమన్వయం మరోసారి రుజువైందని చెప్పారు. ప్రపంచంలోని ఐదో ఎత్తైన పర్వతం మౌంట్ మాకాలును (8,485 మీటర్లు) ఏప్రిల్ 19న విజయవంతంగా అధిరోహించిన ఐటీబీపీని అమిత్ షా అభినందించారు. స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో అక్కడ 150 కిలోల చెత్తను తొలగించడాన్ని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చ కోసం పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిరాసక్తత చూపిస్తున్నట్లు సమాచారం. పహల్గాం దాడి అనంతరం భారత్‌పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండు చేస్తున్నాయి. జులైలో వర్షాకాల సమావేశాల్లోనే ప్రతిపక్షాల ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పనుంది.

## జ్ఞానపీఠ్ పురస్కారం స్వీకరించిన గుల్జార్, రామభద్రాచార్య



ఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం 2023వ సంవత్సరానికి జ్ఞానపీఠ్ పురస్కారాన్ని ప్రముఖ కవి, సినీ గేయరచయిత గుల్జార్‌కు, సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్యకు అందజేశారు. గుల్జార్ అసలు పేరు సంపూర్ణ సింగ్ కాలరా. హిందీ సినిమాల్లో గొప్ప గేయరచయితగా పేరు తెచ్చుకున్నారు. అద్భుతమైన ఉర్దూకవుల్లో ఒకరిగా పేరుంది. అనారోగ్య కారణాలతో ఈ కార్యక్రమానికి గుల్జార్ హాజరుకాలేకపోయారు. 75 ఏళ్ల జగద్గురు రామభద్రాచార్య చిత్రకూట్‌లోని తులసీ పీఠ్ వ్యవస్థాపకుడు. ప్రముఖ హిందూ ఆధ్యాత్మిక గురువు, సంస్కృత పండితుడు. 240కు పైగా గ్రంథాలు రాశారు. ఆయన రాష్ట్రపతి చేతుల మీదుగా నగదు పురస్కారం, సరస్వతి కాంస్య విగ్రహం అందుకున్నారు. సాహిత్యానికి, సమాజానికి రామభద్రాచార్య చేసిన సేవలను ముర్ము కొనియాడారు. 90 ఏళ్ల గుల్జార్‌ను కూడా అభినందించారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్ కీలక ప్రకటన



**కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

ఈకబురు ,హైదరాబాద్: జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో అక్కడక్కడా కురుస్తున్న వర్షాలకు తడిసిందని భావిస్తున్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఇప్పటికే 50 లక్షల టన్నులు దాటాయని వెల్లడించారు. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్లపై సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిరామకృష్ణారావు, పౌర సరఫరాలశాఖ ముఖ్యకార్యదర్శి డీఎస్ చౌహాన్, డైరెక్టర్ ప్రసాద్‌తో పాటు మార్కెటింగ్, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ''ధాన్యం కొనుగోలులో రానున్న 10 నుంచి 12 రోజులు అత్యంత కీలకం. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి. 202223 రబీ సీజన్‌లో మే 15 నాటికి 25.35 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. 202324 అదే రబీలో 32.93 లక్షల టన్నుల కొనుగోళ్లు జరిగాయి. ఈ ఏడాది రబీలో మే 15 నాటికి కొనుగోళ్లు ఏకంగా 50 లక్షల టన్నులకు చేరాయి. రైతులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అనుకూల విధానాల ఫలితాలను ఈ ధాన్యం కొనుగోళ్లు ప్రతిబింబిస్తున్నాయి. ఈ సీజన్‌లో 70 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటికే 71 శాతం మేర కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశాం. పెరిగిన ధాన్యం దిగుబడికి అనుగుణంగా 8,348 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు అక్కడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల్ని ఏర్పాటు చేశాం. గత రబీ సీజన్‌తో పోల్చి చూస్తే ఈ రబీలో అదనంగా 1,311 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ధాన్యం కొనుగోళ్ల అంశంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నివారించేలా చర్యలు చేపట్టి రైతులకు భరోసా కలిగించాలి. వారిలో విశ్వాసం కలిగించాలి. క్షేత్రస్థాయిలోని వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి'' అని అధికారులకు ఉత్తమ్ సూచించారు. తెల్లరేషన్ కార్డుల జారీ అంశంపై స్పందిస్తూ అర్హుల దరఖాస్తుల పరిశీలన తుది దశకు చేరిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 90 లక్షల రేషన్ కార్డుల ద్వారా 2.82 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని మంత్రి వివరించారు.

## ట్యాంక్‌బండ్‌పై తిరంగా యాత్ర.. పాల్గొనాలని ప్రజలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు

''ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచే ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసింది. పాక్ ఆర్మీకి చెందిన 11 కీలకమైన స్థావరాలను మన దేశ సైనికులు ధ్వంసం చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద తిరంగా యాత్ర నిర్వహిస్తున్నాం. అంబేద్కర్ విగ్రహం నుంచి మిలటరీ ట్యాంక్ వరకు ఈ యాత్ర ఉంటుంది. అనేక మంది ప్రముఖులు ఈ యాత్రలో పాల్గొనబోతున్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్రలో ఎమ్మెల్యేలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలి''అని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.



## భారత్ సమీపంలో చైనా గూఢచారి నౌక.. పాక్‌కు సాయం చేసేందుకేనా?



**ఆపరేషన్ సిందూర్ తర్వాత హిందూ మహా సముద్రంలో చైనా గూఢచారి నౌక డ యాంగ్ యి హావో కదలికలు కనిపించాయి.**

ఈ కబురు ,: పాకిస్థాన్ సహా, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసేందుకు మన బలగాలు ఆపరేషన్ సిందూర్ ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ జరిగిన వెంటనే భారత జలాల్లో చైనాకు చెందిన గూఢచారి నౌక కదలికలు కనిపించడం చర్చనీయాంశమైంది. ఇది పాక్‌చైనా బంధాన్ని తెలిపేలా ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు జాతీయ మీడియా కథనం రాసుకొచ్చింది .'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో చైనా నౌక భారత జలాలకు సమీపంలో సంచరించడం పలు అనుమానాలకు తావిచ్చింది. మన సముద్ర జలాల్లోని భారత నౌకల కదలికలు, నిఘా, ప్రతిస్పందన సామర్థ్యాన్ని, జలాంతర్గాముల కదలికలను హైడ్రోగ్రాఫిక్ పరికరాల సాయంతో చైనా పసిగట్టే అవకాశం ఉందని ఆ వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రంలో ఉత్తరం వైపు మన నౌకాదళం అత్యంత అప్రమత్తమైన సంగతి తెలిసిందే. ఐఎన్ఎస్ విక్రాంత్ , బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించింది .ఆ గూఢచారి నౌకకు ఉన్న అధునాతన సెన్సర్లతో ఐఎన్ఎస్ విక్రాంత్ సహా భారత యుద్ధ నౌకల కదలికలను పసిగట్టేందుకు వీలుంది.పాక్‌కు తమ మద్దతు ఉందని సంకేతాలు పంపేందుకు, నిఘా సమాచారాన్ని సేకరించేందుకు ఈ మోహరింపు ఉపయోగించుకొని ఉండొచ్చని అనుమానాలు. ఒకవేళ పాకిస్థాన్‌లోని కరాచీపై భారత్ దాడి చేసేందుకు సన్నాహాలు చేస్తే, వాటిని ముందుగానే పసిగట్టి, సదరు సమాచారాన్ని పాకిస్థాన్‌కు తెలియజేసేలా ఈ మోహరింపు ఉండి ఉండొచ్చు.చైనా ప్రతిష్ఠాత్మక బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్ (బీఆర్ఐ) కింద చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ నిర్మాణం జరుగుతోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా సీపెక్ ప్రాజెక్టు చేపట్టడంపై భారత్ మొదట్నుంచీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేస్తోంది. ఈ ప్రాజెక్టు పనులు పూర్తి కావాలంటే పాక్‌లో రాజకీయంగా, ఆర్థికంగా స్థిరమైన పరిస్థితులు ఉండటం డ్రాగన్‌కు అత్యంత కీలకం. అది కూడా నిఘా వెనక కారణం కావొచ్చు.ఈ నౌక భారత నౌకాదళ విభాగాల మధ్య కమ్యూనికేషన్‌ను అడ్డంకులు సృష్టించగలదు.యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్‌లో కీలకమైన జలాంతర్గాముల రాకపోకలను ఇది మ్యాప్ చేయగలదు. అలాగే ఇక్కడ సేకరించిన సమాచారాన్ని పాక్‌లో నిర్మించాలనుకుంటున్న మిలిటరీ లాజిస్టిక్స్ బేస్ కోసం ఉపయోగించుకోవచ్చు.హిందూ మహాసముద్రంలో ఇలా చైనా నౌకల కదలికలు ఉండటం ఇదే తొలిసారి కాదు. 2024లో యువాన్ వాంగ్ 6 వంటి నౌకలను మోహరించింది. ఈ ప్రాంతంతో భారత ఆధిపత్యాన్ని సవాలు చేసే లక్ష్యంగానే ఈ చర్యలు ఉన్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఎందుకు ఆలస్యం?

ధాన్యం వచ్చిందని, 51.39 ఎల్ఎంటీల ధాన్యాన్ని సేకరించామని, 49.87 ఎల్ఎంటీల ధాన్యాన్ని మిల్లులకు తరలించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఆలస్యంగా వరి సాగు చేసిన ఉమ్మడి వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ మొదలైన జిల్లాల్లో మినహా దాదాపు అన్ని జిల్లాల్లో కోతలు పూర్తి అయినప్పటికీ ఆయా జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదని కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు పడుతున్న రైతుల్ని చూస్తే అర్థమవుతుంది. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో 20 రోజులుగా రైతులు పడిగాపులు పడుతున్నా వడ్ల బస్తాలకు నిర్వాహకులు కాంటా వేయడం లేదు. ఎందుకంటే.. లారీలు లేవు, హమాలీల కొరత ఉందని నిర్వాహకులు చెపుతున్నారు. లారీలు లేకపోతే ట్రాక్టర్‌తో రైతులే సొంతంగా ధాన్యాన్ని మిల్లుకు తీసుకెళ్తామన్నా కూడా హమాలీల కొరత పేరు చెపుతూ కాంటా వేయడం లేదు. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, మహబూబాబాద్, నాగర్‌కర్నూలు, వనపర్తి, కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, భూపాలపల్లి, జనగాం తదితర జిల్లాల్లోని అనేక మండలాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ఇంకా ధాన్యం కుప్పలు నిండుగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఇంకా సుమారు 20 ఎల్ఎంటీల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. వాస్తవానికి కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించడానికి ముందే లారీల సరఫరా కాంట్రాక్టును జిల్లా అధికార యంత్రాంగం ఖరారు చేసి, ప్రణాళికాబద్ధంగా కేంద్రాల నుంచి మిల్లులకు వడ్ల బస్తాలను తరలించాల్సి ఉంది. కానీ ఈసారి ప్రణాళిక తప్పిందని అధికారులే అంగీకరిస్తున్నారు. హమాలీల విషయంలోనూ ఇదే జరిగిందనే విమర్శలు ఉన్నాయి. ధాన్యం దిగుబడి, కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం రావొచ్చనే అంచనాను బట్టి ఏ జిల్లాకు ఆ జిల్లాలో జాయింట్ కలెక్టర్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి లారీలు, ఇతర ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అయితే కొనుగోలు కేంద్రాల్లో పెద్ద మొత్తంలో ధాన్యం నిల్వ ఉండటాన్ని బట్టి చూస్తే లారీల కొరత ఉందనే విషయం స్పష్టమవుతోంది. ఇక హమాలీలు ఎక్కువ కూలీ లభించే మక్కజొన్న, ఇతర పంటల కొనుగోళ్ల వద్దకు వెళ్లడం, ఉపాధి హామీ పనులకు వెళుతుండడం వల్ల ధాన్యం కేంద్రాలకు రావడం లేదని తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చిన తర్వాత కాంటా వేసేంత వరకే రైతు బాధ్యత. కాంటా వేసిన తర్వాత రైతుకు ఆ ధాన్యంతో సంబంధం ఉండకూడదు. ప్రభుత్వం కూడా అదే చెబుతుంది. కానీ మిల్లరు ధాన్యం బస్తాలను దించుకునేంత వరకు రైతుదే బాధ్యత అన్నట్టుగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. అమాయక రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. భయపెడుతున్న ముందస్తు రుతు పవనాలు గత రెండు సంవత్సరాలతో పోలిస్తే ఈసారి ధాన్యం కొనుగోళ్లు ఎన్నో రెట్లు ఎక్కువని ప్రభుత్వం చెపుతోంది. అదే సమయంలో ఈసారి గతంలో కన్నా కొంత ముందుగా నాట్లు వేయడం, సన్న రకాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో కోతలు ముందే వచ్చాయి. రైతుల అదృష్టం కొద్దీ ఈసారి దిగుబడి కూడా బాగుంది. ఈ పరిస్థితుల్లో కొనుగోళ్లు ముందుగానే ప్రారంభం కావడంతో ఇప్పటివరకు 51.39 ఎల్ఎంటీల ధాన్యం కొనుగోలు చేశారు. కేంద్రాల్లో ఇంకా 4.34 ఎల్ఎంటీల ధాన్యం కాంటా వేయకుండా ఉందని పౌరసరఫరాల శాఖే చెబుతోంది. అలాగే కొనుగోలు చేసిన ధాన్యంలోనూ ఇంకా సుమారు లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించ లేదని స్పష్టం చేస్తోంది. అయితే మొత్తంగా సుమారు 10 ఎల్ఎంటీల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉందని అంచనా. కాగా అకాల వర్షాలు రైతులను ప్రతిరోజూ భయపెడుతున్నాయి. భారీ వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల తడిచిన ధాన్యం ఆరితే కానీ రైతులు అమ్ముకోలేని పరిస్థితి ఉంది. తాజాగా.. రుతు పవనాలు ఈసారి ముందుగానే రాష్ట్రంలో ప్రవేశిస్తాయనే వార్తలతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. లారీలు, హమాలీలను అందుబాటు ఉంచడం ద్వారా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాష్ట్రంలో 6,58,486 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 51.39 ఎల్ఎంటీల ధాన్యంలో దొడ్డు రకం 34.02 ఎల్ఎంటీలు కాగా, సన్నాలు 17.37 ఎల్ఎంటీలు ఉన్నాయి. సన్నాలు 30 ఎల్ఎంటీల వరకు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేయగా, ప్రస్తుత పరిస్థితిని చూస్తే సాధ్యమయ్యే అవకాశం లేదని అధికారులు చెపుతున్నారు. నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, కామారెడ్డి, నారాయణపేట , వనపర్తి మొదలైన జిల్లాల్లో పండించిన మేలు రకం సన్న ధాన్యాన్ని రైతులు అధిక ధరకు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు సన్నాలు ఆశించిన స్థాయిలో రాలేదు. మరో 5 లక్షల నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తే తప్ప రేషన్ దుకాణాలకు ఇవ్వాల్సిన సన్న బియ్యానికి సరిపోవని అధికారులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపుల వివరాలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. అయితే లారీలు, హమాలీల కొరత, స్థానిక మిల్లుల ట్యాగింగ్‌లో జాప్యంతో పలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం కుప్పలుగా పడి ఉంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్‌కు చెందిన గంగవ్వ నాలుగెకరాల్లో పండిన ధాన్యాన్ని స్థానిక కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి 20 రోజులవుతున్నా వడ్లు కాంటా కాలేదు. వర్షాల భయంతో ధాన్యంపై కవర్లు కప్పి పడిగాపులు పడుతోంది. జైపూర్ మండలం పౌనూరుకు చెందిన జాడి బాపు నాలుగెకరాల్లో పండించిన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చి పది రోజులు గడుస్తున్నా కాంటా వేయడం లేదు. దీంతో వర్షం వస్తే నష్టపోతానని ఆందోళన చెందుతున్నాడు. మరోవైపు మిల్లర్లు తరుగు పేరుతో 2 నుంచి 5 కిలోలకు పైగా కోత పెడుతున్నారని చెన్నూరు మండలం కిష్టంపేట, ఎల్లక్కపేట తదితర చోట్ల రైతులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పైతర కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేసినా, లారీలు రాకపోవడంతో వారం రోజులుగా రవాణాకు నోచుకోలేదు. అకాల వర్షాలకు దాదాపు 800 బస్తాల ధాన్యం తడిసింది. దీంతో సంచుల్లోంచి మొలకలు ఇలా బయటకు వచ్చాయి.

20 రోజులైనా కాంటా కాలేదు.. నాకు ఉన్న 3 ఎకరాల్లో వరి పంట సాగు చేశా. కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చి 20 రోజులు అవుతుంది. ఇప్పటివరకు కాంటా పెట్టలేదు. అదేమంటే లారీల కొరత ఉందని చెబుతున్నారు. రోజూ కేంద్రానికి వచ్చి ఎప్పుడు కాంటా పెడతారా అని ఎదురుచూస్తున్నా. రైతులం చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం తొందరగా వడ్లు కొనాలి. - కొల్లి తిప్పారెడ్డి, రైతు, జటప్రోలు, పెంట్లవెల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా





# భారత్ దెబ్బకు కుదేలైన సెలెబీ షేర్

**10శాతానికి పైగా పతనం**
**భారత్ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం ప్రభావం సెలెబీ సంస్థపై తీవ్రంగానే ప్రభావం చూపుతోంది.**

తుర్కియేకు చెందిన సెలెబీకి భారత్ కొట్టిన దెబ్బ కాస్త గట్టిగానే తాకినట్లుంది. మే 16న ఇస్తాంబుల్‌లో ఆ కంపెనీ షేరు ధర ఏకంగా 10శాతం పతనమైంది. గత నాలుగు సెషన్లలో ఈ షేరు విలువ 30శాతం ఆవిరైంది. సెలెబీ సబ్సిడరీ కంపెనీ ద్వారా భారతీయ విమానాశ్రయాలలో సరకుల రవాణాతోపాటు బహుళ సేవలను ఇన్నాళ్లూ అందించింది. కానీ, ఆపరేషన్ సిందూర్ సమయంలో తుర్కియే ప్రభుత్వం పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడంతో పాటు తమ సైనికులను అక్కడకు పంపింది. దీంతో ఆగ్రహించిన భారత ప్రభుత్వం సెలెబీకి ఉన్న సెక్యూరిటీ క్లియరెన్స్‌లను రద్దు చేసింది.

మరోవైపు అదానీ ఎయిర్ పోర్టు సంస్థ కూడా సెలెబీతో ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకొంది. దీంతో ముంబయి, అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుల నుంచి అది బయటకు వెళ్లినట్లైంది. ఈ విషయాన్ని రెండు ఎయిర్ పోర్టులకు చెందిన ప్రతినిధి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం అదానీ ఎయిర్ పోర్ట్స్ హోల్డింగ్‌కు ముంబయి, అహ్మదాబాద్, మంగళూరు, గువహాటి, జైపుర్, లఖ్‌నవూ, తిరువనంతపురం విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. ప్రభుత్వ నిర్ణయం తర్వాత దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లిమిటెడ్ కూడా తన ఒప్పందాన్ని రద్దు చేసుకొంది. ఆ స్థానంలో ఏఐఎస్ఏటీఎస్, బర్డ్‌గ్రూప్‌తో కలిసి పనిచేయనున్నట్లు తెలిపింది.

ఇక తమది తుర్కియే కంపెనీయే కాదని తాజాగా సెలెబీ వివరణ ఇచ్చింది. ఆ దేశాధ్యక్షుడు ఎర్డోగాన్ కుటుంబంతో తమకు సంబంధం లేదని, ఆయన కుమార్తె తమకు బాస్ కాదని వివరణ ఇచ్చింది. ‘‘తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ కుమార్తె సుమెయ్యి మా కంపెనీని నియంత్రిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. మా మాతృసంస్థలో ఆ పేరుతో ఎవరికీ హక్కులు గానీ, వాటాలు గానీ లేవు. అసలు మాది తుర్కియే సంస్థే కాదు. మా కంపెనీ యాజమాన్య హక్కులన్నీ సెలెబీయోగ్లు కుటుంబానికే పరిమితం. వారికి ఎలాంటి రాజకీయ సంబంధాలు లేవు ’’ అని కంపెనీ తమ ప్రకటనలో వెల్లడించింది.

# నష్టాల్లో ముగిసిన సూచీలు..
# 25 వేల ఎగువనే నిఫ్టీ



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 200, నిఫ్టీ 42 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.
**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీలు నష్టాలను చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ 200 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ మాత్రం 25 వేల పాయింట్ల పైనే కొనసాగుతోంది. స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.94 శాతం మేర లాభపడగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 1.86 శాతం మేర లాభపడింది. సెన్సెక్స్ ఉదయం 82,392.63 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,530.74) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,146.95 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 200.15 పాయింట్ల నష్టంతో 82,330.59 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 42.30 పాయింట్ల నష్టంతో 25,019.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 3 పైసలు బలపడి 85.51గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, టాటా మోటార్స్ షేర్లు రాణించాయి. భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు మళ్లీ 3200 మార్కు దాటి 3205 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఎన్‌సీసీ లాభం రూ.254 కోట్లు




మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్వహించే సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్, మార్చి త్రైమాసికానికి ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.6,189.36 కోట్ల ఆదాయం, రూ.253.82 కోట్ల నికరలాభం ఆర్జించింది.

హైదరాబాద్: మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్వహించే సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్, మార్చి త్రైమాసికానికి ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.6,189.36 కోట్ల ఆదాయం, రూ.253.82 కోట్ల నికరలాభం ఆర్జించింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.4.04గా నమోదైంది. 2023 24 ఇదేకాలంలో ఆదాయం రూ.6,530.05 కోట్లు, నికరలాభం రూ.239.16 కోట్లు, ఈపీఎస్ రూ.3.81 ఉన్నాయి. దీంతో పోల్చితే ఈసారి ఆదాయం తగ్గినా, నికరలాభం పెరిగింది.

202425 పూర్తి కాలానికి ఎన్‌సీసీ రూ.22,354.91 కోట్ల ఆదాయం, రూ.819.88 కోట్ల నికరలాభం, 13.06 వార్షిక ఈపీఎస్ నమోదు చేసింది. వాటాదార్లకు ఒక్కో షేరుకు రూ.2.20 చొప్పున డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు ప్రతిపాదించింది.
గత ఆర్థిక సంవత్సరంలో ఎన్‌సీసీ కొత్తగా రూ.32,888 కోట్ల ఆర్డర్లు సంపాదించింది. దీంతో కంపెనీ చేతిలో ఉన్న ఆర్డర్ల విలువ రూ.71,568 కోట్లకు పెరిగింది.




# ఆదాయపు పన్ను రిటర్నులకు సిద్ధమా?

**ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసే తరుణం ఆసన్నమయ్యింది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఐటీఆర్‌లనూ విడుదల చేసింది.**

ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసే తరుణం ఆసన్నమయ్యింది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఐటీఆర్‌లనూ విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో (202425) ఆర్జించిన ఆదాయాన్ని నివేదిస్తూ ప్రస్తుత మదింపు సంవత్సరంలో (2025 26)లో రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎవరు ఎలాంటి ఫారాల్లో రిటర్నులు దాఖలు చేయాలన్న సంగతిని పరిశీలిద్దాం.

ఆదాయాన్ని ఆర్జించే విధానాన్ని బట్టి, ఎవరు ఏ ఫారంలో రిటర్నులు దాఖలు చేయాలనేది ఆదాయపు పన్ను శాఖ స్పష్టంగా పేర్కొంది. వివరాలను చూస్తే..

**ఐటీఆర్-1 (సహజ్)**
వేతనం, ఒక ఇంటి ద్వారా ఆదాయం, ఇతర మూలాల నుంచి ఆదాయం (బ్యాంకు వడ్డీ, డివిడెండ్) ఉన్న వ్యక్తులకు. మొత్తం ఆదాయం రూ. 50లక్షల వరకూ ఉండాలి.
దీర్ఘకాలిక మూలధన లాభాలు (సెక్షన్ 112ఏ కింద) రూ.1.25 లక్షల వరకూ ఉన్నప్పుడు. నష్టాలను ముందు సంవత్సరాలకు సర్దుబాటు చేయాలని అనుకోకపోతే ఈ ఫారాన్ని వాడొచ్చు.
వ్యాపార ఆదాయం, విదేశీ ఆస్తులు, ఒకటి కంటే ఎక్కువ ఇంటి ఆస్తులు ఉన్న వారికి ఈ ఫారం వర్తించదు.

**ఐటీఆర్-2**
రూ.50లక్షలకు మించి ఆదాయం ఉన్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఒకటికి మించి ఇంటి ఆదాయం ఉన్న వారు. మూలధన లాభాలు /నష్టాలు, విదేశీ ఆదాయం/ ఆస్తులు ఉన్న వారు దీన్ని ఉపయోగించవచ్చు. నీ వ్యాపారం, వృత్తి ద్వారా ఆదాయం ఆర్జించిన వారికి ఇది సరిపోదు.

**ఐటీఆర్ -3**
వ్యాపారం లేదా వృత్తిపరమైన ఆదాయం ఉన్న వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌ల కోసం. ఇందులో ఐటీఆర్ 2తో సమానమైన మూలధన లాభాల షెడ్యూల్ ఉంటుంది.

**ఐటీఆర్-4 (సుగమ్)**
వ్యాపారం లేదా వృత్తిపరమైన ఆదాయం రూ. 50లక్షల వరకూ (పన్ను ఆడిట్ అవసరం లేని వారు) ఉన్న వారికి, జీతం, ఒక ఇంటి ఆస్తి నుంచి ఆదాయం ఉన్న వారికి. ఐటీఆర్ 1తో సమానమైన మూలధన లాభాల నిబంధనలు వర్తిస్తాయి.

**ఐటీఆర్-5**
సంస్థలు, ఎల్‌ఎల్‌పీలు, సహకార సంఘాలు, ఇతర సంఘాల కోసం. మూలధన లాభాల షెడ్యూల్ ఐటీఆర్ 2, ఐటీఆర్ 3లతో సమానంగా ఉంటుంది.


**ఐటీఆర్-6**
పన్ను ఆడిట్ అవసరం లేని కంపెనీల కోసం. మూలధన లాభాల షెడ్యూల్ ఇతర ఫారాలతో సమానంగా ఉంటుంది.

**ఐటీఆర్-7**
ట్రస్టులు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు తదితరాల కోసం.

**నిపుణుల సూచనతో..**
కేవలం వేతనం, వడ్డీలాంటి సాధారణ ఆదాయాలు ఉన్న వారు రిటర్నులు సులభంగానే దాఖలు చేసుకోవచ్చు. ఒకటికి మించి ఆదాయాలు ఉన్నప్పుడు, మూలధన లాభాలు, ఆస్తుల క్రయవిక్రయాల్లాంటివి ఉంటే పన్ను నిపుణులను సంప్రదించడం మంచిది. తప్పుడు ఫారాలను ఎంచుకుంటే తిరస్కరణ, జరిమానాల వంటివి ఎదురయ్యే ఆస్కారం ఉంది. మూలధన లాభాలకు సంబంధించిన కొత్త షెడ్యూల్ వల్ల జాగ్రత్తగా ఉండాలని నిపుణుల సూచన.

**జులై 31 వరకూ..**
ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి పోర్టల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ అన్ని పత్రాలూ సిద్ధంగా ఉంటాయి. అందులో మీకు ఏది వర్తిస్తుందన్నదీ తెలుసుకునే ఏర్పాటూ ఉంటుంది. 202526 మదింపు సంవత్సరంలో రిటర్నుల సమర్పణకు జులై 31, 2025 వరకూ (ఆడిట్ అవసరం లేని వారికి) గడువు ఉంది. ఆ తర్వాత అపరాధ రుసుముతో రిటర్నులు సమర్పించాల్సి వస్తుంది.

**ఆధార్ తప్పనిసరి**
రిటర్నులు దాఖలు చేయాలనుకుంటే పాన్‌ఆధార్ అనుసంధానం తప్పనిసరి. గతంలో ఆధార్ నమోదు సంఖ్య (ఎన్‌రోల్‌మెంట్ ఐడీ) పేర్కొన్నా సరిపోయేది. కానీ, ఇప్పుడు ఈ వెసులుబాటు లేదు. కచ్చితంగా ఆధార్ సంఖ్య తెలియజేయాల్సిందే. రిటర్నులలో ఆ మేరకు మార్పులు వచ్చాయి.



# బీమా..ఆ మాటలు నమ్మొద్దు

**‘ఆరేళ్ల నుంచీ ఆరోగ్య బీమాకు ప్రీమియం చెల్లిస్తున్నారా? ఒక్క క్లెయిమూ చేసుకోలేదా? మేము ఏదో ఒక విధంగా మీకు కొంత డబ్బు ఇప్పిస్తాం.**

‘ఆరేళ్ల నుంచీ ఆరోగ్య బీమాకు ప్రీమియం చెల్లిస్తున్నారా? ఒక్క క్లెయిమూ చేసుకోలేదా? మేము ఏదో ఒక విధంగా మీకు కొంత డబ్బు ఇప్పిస్తాం. అందులో నుంచి 2030 శాతం మాకివ్వండి చాలు’ అంటూ ఇటీవలి కాలంలో మిమ్మల్ని ఎవరైనా సంప్రదించారా? వీరిని నమ్మి మీ ఆరోగ్య బీమా పాలసీ వివరాలు చెప్పారో..ఇక అంతే సంగతి... మీరు మోసగాళ్ల బారిన పడినట్లే. ఇది మీకు భవిష్యత్తులో నష్టమూ చేకూరుస్తుంది.

అనారోగ్యంలో ఆర్థిక రక్షణ కల్పించేది ఆరోగ్య బీమా. దీనికి చెల్లించిన ప్రీమియం ఒక పెట్టుబడిగానే చూడాలి. కానీ, ఖర్చుగా కాదు. ఆసుపత్రిలో చేరినప్పుడు బిల్లు మొత్తాన్ని నిర్ణీత మొత్తం వరకూ బీమా పాలసీనే భరిస్తుంది. పాలసీ ఉన్నంత మాత్రాన ఉపయోగించుకోవాలని కాదు. అనుకోని పరిస్థితుల్లో ఇబ్బంది రాకుండా ఉండాలనే పాలసీ తీసుకోవాలి. కానీ, కొంతమంది మోసగాళ్లు.. ఎలాంటి క్లెయిములూ చేయని వారిని లక్ష్యంగా చేసుకొని, మోసపూరితంగా క్లెయింలు చేయించి, బీమా పాలసీ నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలపై బీమా సంస్థలు పాలసీదారులను అప్రమత్తం చేస్తున్నాయి.

**ఏం చేస్తారు?**
చెల్లించిన ప్రీమియం వృథా అయిపోతుందని, ఎందుకు వదిలేయాలని చెబుతూ ఫోన్ చేస్తారు. ఏదో ఒక విధంగా తాము క్లెయిం చేస్తామని చెబుతారు. పాలసీదారులను దీనికోసం ఒప్పించే ప్రయత్నం చేస్తారు. మోసగాళ్ల మాయ మాటలకు లొంగిపోయారనుకోండి.. వెంటనే వారు పాలసీదారుల అన్ని వివరాలూ తీసుకుంటారు. ఏదో ఒక ఆసుపత్రిలో వేరే వ్యక్తిని చేర్పించి, చికిత్స అందిస్తున్నట్లు అన్ని రకాల ఆధారాలూ సృష్టిస్తారు. ఆ తర్వాత క్లెయిం చేసి, బీమా సంస్థల నుంచి డబ్బులు రాబడతారు. కానీ, తర్వాత ఇబ్బందులు ఎదురయ్యేది పాలసీదారులకే అనేది వారికి అవసరం లేదు.

**సాంకేతికత ఆధారంగా..**
ఒకప్పటితో పోలిస్తే బీమా కంపెనీలు ఇప్పుడు చాలా సాంకేతికతను ఉపయోగిస్తున్నాయి. నిజమైన పాలసీదారుడా లేదా తెలుసుకోవడం వాటికి పెద్ద కష్టమేమీ కాదు. ఎన్నాళ్ల నుంచి పాలసీ తీసుకుంటున్నారు, వారికి ఇప్పటి వరకూ అయిన చికిత్సలు, నివాస స్థలానికి ఎంత దూరంగా ఉన్న ఆసుపత్రిలో చేరారు.. ఇలా ఎన్నో మార్గాలుంటాయి.

**థర్డ్ పార్టీతో..**
బీమా కంపెనీలు ఎన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నా మోసాలు పెరుగుతూనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఇప్పుడు చాలా బీమా సంస్థలు థర్డ్ పార్టీ సేవలను ఉపయోగించుకుంటున్నాయి. క్లెయిం రాగానే.. వెంటనే ఆ ఆసుపత్రికి ప్రైవేటు వ్యక్తులను పంపిస్తున్నాయి. వారు అక్కడ నిజంగానే పాలసీదారుడు ఉన్నారా? చికిత్స జరుగుతోందా? అనే విషయాలను ధ్రువీకరిస్తారు. కొన్ని బీమా సంస్థలు మరో అడుగు ముందుకేస్తున్నాయి. ఒకరికి బదులుగా ఇద్దరు వ్యక్తులను పంపి, విచారణ చేయిస్తున్నాయి. సంబంధిత వ్యక్తి ఉద్యోగం చేస్తున్న చోటకూ వారు వెళ్లి అడుగుతుంటారు. ఇలా అనేక పద్ధతుల్లో పాలసీదారుల క్లెయిం నిజమా కాదా అని తెలుసుకుంటున్నాయి. కాబట్టి, మోసపూరిత క్లెయింలో పాలసీదారులు భాగస్వాములు కావొద్దు.

**జాగ్రత్తగా..**
**పాలసీదారుడు మోసగాళ్ల చేతిలో చిక్కుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.**
**మీకు పాలసీ వచ్చాక... అది మీరు అనుకుంటున్న పాలసీయేనా కాదా.. అనేది ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకోండి.**
**మీ మొబైల్ నంబరు, ఇ-మెయిల్‌లాంటివి మారితే వెంటనే బీమా సంస్థకు ఆ విషయాన్ని తెలియజేయండి.**
**పాలసీని క్లెయిం చేసుకుంటున్నట్లుగా మీకు ఏదైనా సందేశం వస్తే... అది వాస్తవం కాకపోతే వెంటనే బీమా సంస్థను సంప్రదించండి.**
**మీకు ఉన్న పాలసీల గురించి మీ కుటుంబ సభ్యులకు పూర్తి వివరాలు చెప్పండి.**
**పాలసీ తీసుకునే సమయంలో ముందస్తు వ్యాధుల గురించి సమాచారం ఇవ్వండి. మీకు సమీపంలో ఉన్న ఆసుపత్రులు బీమా సంస్థ నెట్‌వర్క్ జాబితాలో ఉన్నాయా చూసుకోండి.**
**మీకు తెలియకుండా ఏదైనా క్లెయిం జరిగినట్లు అనిపిస్తే.. వెంటనే బీమా సంస్థకు ఆ విషయాన్ని ఫిర్యాదు చేయండి.**
**గుర్తుంచుకోండి.. మోసం చేసేవారు ఎప్పుడూ ఉంటారు. తెలియకుండా మోసపోవడం వేరే విషయం. కానీ, తెలిసీ మోసగాళ్లకు సహకరిస్తే.. దానికి మనమూ బాధ్యులం అవుతాం. అప్పుడు బీమా సంస్థలు పాలసీదారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకునే ఆస్కారం ఉంటుంది.**

# రామాయణంలో ఛాన్స్ కొట్టేసిన కాజల్ ?

రామాయణం ఆధారంగా మన దేశంలో చాలా సినిమాలు ఇదివరకే తీశారు. తీస్తూనే ఉన్నారు. కొన్నాళ్ల క్రితం ప్రభాస్ 'ఆదిపురుష్' ఇలానే తీశారు. కానీ గ్రాఫిక్స్, పాత్రల తీరుతెన్నులు దారుణంగా ఉండేసరికి విపరీతమైన విమర్శలు వచ్చాయి. కట్ చేస్తే ఇప్పుడు 'రామాయణ్' పేరుతో హిందీలో మళ్లీ సినిమా తీస్తున్నారు.

ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ సినిమాలో 'యానిమల్' ఫేమ్ రణ్ బీర్ కపూర్ రాముడిగా నటిస్తుండగా, సాయిపల్లవి సీత పాత్ర చేస్తోంది. 'కేజీఎఫ్' యష్ రావణుడిగా నటిస్తున్నాడు. మిగిలిన పాత్రల కోసం పలు పేర్లు వినిపిస్తున్నప్పటికీ ఎవరిని ఫైనల్ చేశారనేది ఇంకా బయటపెట్టలేదు.

ప్రస్తుతానికైతే మండోదరి పాత్ర కోసం కాజల్ అగర్వాల్ ని తీసుకున్నారనే రూమర్స్ వినిపిస్తున్నాయి. రావణుడి భార్య పేరు మండోదరి. రామాయణ్ మూవీలో ఈమె పాత్రకు చాలా తక్కువ ప్రాధాన్యం ఉండొచ్చు. మరి కాజల్ నిజంగా ఒప్పుకొందా? లేదంటే ఇవి రూమర్స్ మాత్రమేనా అనేది మరికొన్ని రోజుల్లో క్లారిటీ రావొచ్చు.
నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేయబోతున్నారు. 2026 దీపావళికి తొలి భాగం, 2027లో రెండో భాగం రిలీజ్ చేయబోతున్నారు. మరి ఈ మూవీతో దర్శకనిర్మాతలు ఎలాంటి సంచలనాలు సృష్టిస్తారో చూడాలి?






## ఆల్రెడీ స్ట్రీమింగ్.. ఇప్పుడు మరో ఓటీటీలోనూ రిలీజ్

ఒకే సినిమా రెండు మూడు ఓటీటీల్లోనూ రిలీజ్ అయిన సందర్భాలు అడపాదడపా ఉండనే ఉన్నాయి. ఇప్పుడు ఆ లిస్టులోకి చేరిపోయింది లేటెస్ట్ తెలుగు మూవీ. కల్యాణ్ రామ్, విజయశాంతి ప్రధాన పాత్రలు చేసిన ఈ మూవీ ఇప్పటికే ఒకదానిలో రిలీజ్ కాగా.. ఇప్పుడు మరో దానిలోకి కూడా రాబోతుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన చేశారు.
కల్యాణ్ రామ్ లేటెస్ట్ మూవీ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. రిలీజ్ కి ముందు చాలా హడావుడి చేశారు గానీ సినిమాలో అంత సీన్ లేకపోయేసరికి ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోలేదు. కట్ చేస్తే థియేటర్లలోకి వచ్చిన నెలలోపే అమెజాన్ ప్రైమ్ ఓటీటీలోకి వచ్చేసింది. ఈ రోజు (మే 16) నుంచి అందుబాటులోకి వచ్చింది.
ఇప్పుడు ఆహా ఓటీటీలోనూ వచ్చే శుక్రవారం (మే 23) నుంచి స్ట్రీమింగ్ కానుందని ప్రకటించారు. ఈ మేరకు పోస్టర్ రిలీజ్ చేశారు. తల్లికొడుకుల బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీసిన ఈ ఎమోషనల్ డ్రామా మరి ఓటీటీలో ఏ మేరకు రెస్పాన్స్ అందుకుంటుందో చూడాలి?
అర్జున్ సన్నాఫ్ వైజయంతి విషయానికొస్తే.. వైజయంతి (విజయశాంతి) సిన్సియర్ పోలీసాఫీసర్. ఈమె కొడుకు అర్జున్ కూడా పోలీస్ అయ్యేందుకు కష్టపడుతుంటారు. కానీ ఓ సందర్భంలో తన తండ్రిని చంపిన హంతకుడిని అందరూ చూస్తుండానే అర్జున్ చంపేస్తాడు. దీంతో తల్లికొడుకుల మధ్యం దూరం పెరుగుతుంది. మరి వీళ్లిద్దరూ కలిశారా? చివరకు ఏమైందనేదే స్టోరీ.



## అల్లు అర్జున్‌తో లవ్‌స్టోరీ.. మహేశ్‌బాబుతో మైథలాజికల్: నిహారిక

**టాలీవుడ్ హీరోల్లో ఎవరెవరితో ఎలాంటి సినిమాలు నిర్మించాలనుకుంటున్నారో నిహారిక తెలిపారు. అల్లు అర్జున్, మహేశ్‌తోపాటు ఆ జాబితాలో ఇంకెవరున్నారో చూసేయండి..**

అల్లు అర్జున్‌తో ప్రేమకథా చిత్రాన్ని, మహేశ్‌బాబుతో మైథలాజికల్ మూవీని, ప్రభాస్‌తో కామెడీ ఫిల్మ్ నిర్మించాలనుందని నిహారిక చెప్పారు. ఒకవేళ దర్శకత్వం వహిస్తే.. తొలి సినిమా రామ్‌చరణ్‌తో ఉంటుందన్నారు. ఓ అవార్డుల వేడుకలో.. టాలీవుడ్ హీరోల్లో ఎవరెవరితో ఎలాంటి జానర్ సినిమాలు చేయాలనుకుంటున్నారు? అని యాంకర్ ప్రశ్నించగా నిహారిక స్పందించారు. ఎక్కువ మేకప్ వేసుకోవద్దని తనలోని యాంకర్‌కి, నిన్ను నువ్వు నమ్ముకో అని తనలోని నిర్మాతకు, మంచి స్క్రిప్టులు ఎంపిక చేసుకోమని తనలోని నటికి తానే సలహా ఇచ్చుకున్నారు.

హోస్ట్‌గా, నటిగా తనని తాను నిరూపించుకున్న నిహారిక.. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో నిర్మాతగా మారిన సంగతి తెలిసిందే. ఆ చిత్రానికిగానూ 'వర్సటైల్ ప్రొడ్యూసర్ ఆఫ్ ఇది ఇయర్' అవార్డు అందుకున్నారు. ఇటీవల జరిగిన ఆ కార్యక్రమానికి సంబంధించిన వీడియో ఇప్పుడు విడుదలైంది. 'మ్యాడ్' ఫేమ్ సంగీత్ శోభన్ హీరోగా ప్రస్తుతం ఓ సినిమా నిర్మిస్తున్నారు నిహారిక. మానస శర్మ దర్శకురాలు.

## 40ప్లస్ క్లబ్‌లో అనసూయ.. ఇదే గ్లామర్‌తో ఇంకెన్నాళ్లు?



దాదాపు ఓ పన్నెండేళ్ల క్రితం టీవీ చానెల్‌లో న్యూస్ ప్రెజెంటర్‌గా తన ప్రస్తానం ప్రారంభమైనప్పుడు తానే కాదు ఎవరూ ఊహించి ఉండరు.. ఇంతగా, ఇన్ని విధాలుగా అనసూయ తెలుగు వారికి దగ్గరవుతుందని. కేవలం పుష్కర కాలంలో పుష్కలమైన అవకాశాలు అందుకుంటూ అంతకంతకూ ఎదుగుతూ వచ్చిన అనసూయ...స్టార్ యాంకర్ నుంచి సిల్వర్ స్క్రీన్ స్టార్ దాకా దూసుకుపోయింది.
తెలుగులో చిన్నితెర మీద యాంకర్, ప్రోగ్రామ్ హోస్ట్‌గా చేసిన ఎవరూ సాధించలేకపోయిన క్రేజ్‌ను ఆమె స్వంతం చేసుకుంది. ఓ వైపు యాంకర్‌గా పలు టీవీ షోస్‌లో కనిపిస్తూనే, మరోవైపు వెండితెర మీద కూడా తనదైన ముద్ర వేస్తోంది. క్షణం, రంగస్థలం, పుష్ప లాంటి చిత్రాల్లోని ఆమె పాత్రలు సినీరంగంలో ఆమె అవకాశాలను విస్తృతం చేశాయి. ప్రస్తుతం అనసూయ చిన్నితెర మీద కావచ్చు, వెండితెర మీద కావచ్చు, పబ్లిక్ ఈవెంట్స్ లో కావచ్చు...

**ఫుల్ క్రేజ్ ఉన్న సెలబ్రిటీ అనడంలో అతిశయోక్తి లేదు**

అయితే ప్రస్తుతం సెలబ్రిటీల ఇమేజ్, పాప్యులారిటీని సరైన రీతిలో అంచనా వేయడం సాధ్యం కావడం లేదు. గతంలో ఒక నటి/నటుడు, యాంకర్ ఎవరైనా సరే తమ ప్రతిభ ద్వారా మాత్రమే అత్యున్నత స్థానాన్ని సాధించారని చెప్పేందుకు అవకాశం ఉండేది. అయితే ఈ సోషల్ మీడియా యుగంలో ఇన్‌స్టాలు, రీల్స్...వగైరాలు వెల్లువెత్తుతూ సినీ విమర్శకుల్ని సైతం సెలబ్రిటీల స్థాయిపై విశ్లేషణలకు వీలు లేకుండా చేస్తున్నాయి. మరోవైపు అనసూయ సోషల్ మీడియాలోనూ **మంచి ఫాలోయింగ్ ఉన్న సెలబ్రిటీ.**

ఆమెను ప్రస్తుతం ఈ స్థాయిలో ఉంచిన వాటిలో ఆమె గ్లామర్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తోందనేది నిర్వివాదం. ఆ విషయం ఆమె కూడా గుర్తించింది కాబట్టే సినిమాల్లో కాకున్నా, సోషల్ మీడియాలో గ్లామరస్ పోస్టులు, వీడియోల ద్వారా మెరిపిస్తూ ఉంటుంది. తన దుస్తులు, వస్త్రధారణ విషయంలో వచ్చే విమర్శలకు ఘాటుగా బదులిస్తూ ప్రతి విమర్శలు చేస్తూ వివాదాలతో కూడా నిత్యం వార్తల్లో నిలుస్తుంటుంది. వీటన్నింటి నడుమ... ఆమె దురదృష్టమో అదృష్టమో కానీ.. ఎన్ని వైవిధ్యభరిత చిత్రాల్లో నటించినా, అనసూయ అనగానే ఓ అందమైన అమ్మాయి అనే భావనే సినీ అభిమానుల్లో స్థిరపడిపోయింది. ఏదేమైనా దాదాపు పాతికేళ్లు పైబడిన వయసులో 'షో' బిజినెస్‌లోకి ఆరంగేట్రం చేసిన అనసూయ నిన్నటి(మే 15)తో ఫార్టీ ప్లస్ వయస్కుల క్లబ్‌లోకి చేరుతోంది. ఎంత జాగ్రత్తగా కాపాడుకున్నా ఈ గ్లామర్ ఇకపై ఎంతకాలం నిలుస్తుందో తెలీదు. కాబట్టి ఇకపై నటనలో కూడా తనేంటో నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటిదాకా ఎంచుకున్నట్టే వైవిధ్యభరిత పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పిస్తూ.. గ్లామర్ డోస్‌ను తగ్గిస్తూ... అందమైన మహిళ అనే అభిప్రాయాన్ని మరిపిస్తూ.. అభినయ ప్రావీణ్యమున్న నటిగా కూడా ప్రేక్షకుల్లో బలమైన ముద్ర వేయగలిగితే మరికొన్ని దశాబ్ధాల పాటు ఆమెకు తిరుగు ఉండకపోవచ్చు.

## మనుషులు పుస్తకాలై: 'హ్యూమన్ లైబ్రరీ'పై పూరి మ్యూజింగ్స్

దర్శకుడు పూరి జగన్నాథ్ 'హ్యూమన్ లైబ్రరీ'పై మాట్లాడారు. 'పూరి మ్యూజింగ్స్'లోని లేటెస్ట్ ఎపిసోడ్ విడుదలైంది.

దర్శకుడు పూరి జగన్నాథ్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్ 'పూరి మ్యూజింగ్స్' . ఇప్పటికే పలు టాపిక్స్‌పై తన అభిప్రాయాన్ని పంచుకున్న ఆయన.. తాజాగా 'హ్యూమన్ లైబ్రరీ' గురించి చెప్పారు. అది మంచి కాన్సెప్టు అని, వీలుంటే అక్కడకు వెళ్లాలని సూచించారు. మనుషులు పుస్తకాలుగా మారే ఆ లైబ్రరీ సంగతులు ఆయన మాటల్లోనే..

"లైబ్రరీలో పుస్తకాలుంటాయి. హ్యూమన్ లైబ్రరీలో మనుషులుంటారు. డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగెన్‌లో 2000లో మొదలైంది. ప్రస్తుతం 80 దేశాలకుపైగా విస్తరించింది. మనుషులే పుస్తకాలు అవడం దీని కాన్సెప్టు. మనం వెళితే.. అక్కడి మనుషులు తమ జీవితానుభవాలు మనతో పంచుకుంటారు. పుస్తకాలై అవగాహన కల్పిస్తారు. వాళ్ల స్టోరీ మీకు ఆసక్తిగా అనిపిస్తే వారితో కలిసి కూర్చొని ముచ్చటించొచ్చు. ఆడ, మగ, చిన్నా పెద్దా అందరూ ఉంటారు. 'అన్‌జడ్జ్ సమ్‌వన్' (ఒకరిపై నిర్ణయానికి రావొద్దు) పేరిట ఓ బోర్డు కూడా ఉంటుంది"

"అక్కడికి చూపులేని వారూ వెళుతుంటారు. కళ్లులేని వారికి ఈ ప్రపంచం ఎలా కనిపిస్తుందో వారిలోని ఒకరు చెబితేనేగానీ మనకు తెలియదు. విభిన్న వ్యక్తులతో మాట్లాడడం వల్ల విభిన్న జీవిత కథలు మనకు తెలుస్తాయి. ఒంటరితనం అనుభవించేవారు, హెచ్ఐవీ సోకిన వారు, మానసిక రోగులు, ఇతరుల నెగెటివ్ బిహేవియర్ వల్ల ప్రభావితం అయిన వారు.. ఇలా ఎంతోమందితో మాట్లాడే అవకాశం అక్కడ లభిస్తుంది. విదేశాల్లోనే కాదు ముంబయి, దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో ఈ లైబ్రరీలు ఉన్నాయి. సాధారణ లైబ్రరీలాగే దీనికీ కొన్ని రూల్స్ ఉంటాయి. మాట్లాడే సమయం 30 నుంచి 60 నిమిషాలు మాత్రమే. మీకు టైమ్ ఉంటే 'హ్యూమన్ లైబ్రరీ'ని ఆస్వాదించండి" అని సూచించారు.






## 90 మీటర్ల మార్క్‌ను దాటేశాడు.. చరిత్ర సృష్టించిన నీరజ్ చోప్రా

**దోహా డైమండ్ లీగ్‌లో నీరజ్ చోప్రా చరిత్ర సృష్టించాడు. తన కెరీర్‌లోనే తొలిసారి 90 మీటర్ల మార్క్‌ను అధిగమించాడు.**

భారత స్టార్ జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా మరోసారి చరిత్ర సృష్టించాడు. తొలిసారి తన కెరీర్‌లో 90 మీటర్ల మార్క్‌ను అధిగమించాడు. ఖతార్ వేదికగా జరుగుతున్న దోహా డైమండ్ లీగ్ మూడో రౌండ్‌లో ఈటెను 90.23 మీటర్లు విసిరి ఈ ఘనత అందుకున్నాడు. ఇప్పటి వరకు నీరజ్ అత్యుత్తమ ప్రదర్శన 89.94 మీటర్లు. 2022లో స్టాక్ హోమ్ డైమండ్ లీగ్‌లో నీరజ్ ఈ ప్రదర్శన చేశాడు. దోహాలో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన నీరజ్ అందుకు తగినట్లుగానే మంచి ఆరంభం అందించాడు. మొదటి రౌండ్‌లోనే 88.84 మీటర్లు విసిరాడు. రెండో రౌండ్‌లోనూ బాగానే విసిరినా.. అది ఫౌల్ అయింది. ఇక మూడో రౌండ్‌లో తన కెరీర్ బెస్ట్‌ను అందించాడు. ఏకంగా 90+ మీటర్లు విసరడం విశేషం. అయితే జర్మనీ ప్లేయర్ జులియన్ వెబర్ (91.06 మీటర్లు) చివరి రౌండ్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. దీంతో నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.



## అప్పుడు స్టేడియంలో నా పేరు చూసుకుంటే.. భావోద్వేగానికి గురైన రోహిత్ శర్మ

ముంబయిలోని వాంఖడే స్టేడియంలో రోహిత్ శర్మ పేరిట ఓ స్టాండ్‌ను ఆవిష్కరించారు.

ముంబయి క్రికెట్ అసోసియేషన్ నుంచి టీమ్ఇండియా స్టార్ ఆటగాడు రోహిత్ శర్మకు అరుదైన గౌరవం దక్కింది. వాంఖడే క్రికెట్ స్టేడియంలోని ఓ స్టాండ్‌కు రోహిత్ శర్మ పేరు పెట్టారు. ఆ స్టాండ్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రోహిత్ తల్లిదండ్రులు, సతీమణి రితిక హాజరయ్యారు. ఈ సందర్భంగా హిట్‌మ్యాన్ మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యాడు. ఆ స్టేడియంతో తనకున్న జ్ఞాపకాలను పంచుకున్నాడు.

భవిష్యత్‌లో వన్డే ఫార్మాట్‌లో టీమ్ఇండియా తరపున వాంఖడే స్టేడియంలో ఆడాలనుందని రోహిత్ పేర్కొన్నాడు. "ఇక్కడికి విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా మలిచిన వారందరికీ నా కృతజ్ఞతలు. ఇలా స్టాండ్‌కు నా పేరు పెడతారని నేనెప్పుడూ ఊహించలేదు. చిన్నప్పుడు ముంబయి తరపున, టీమ్ఇండియా తరపున ఆడాలని కోరుకున్నప్పుడు.. ఎప్పుడూ వీటి గురించి ఆలోచించలేదు. ఏ ఆటగాడికైనా ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని, దేశానికి సేవ చేయాలని ఉంటుంది. ఈ క్రమంలో ఎన్నో మైలురాళ్లు సాధిస్తాం. అయితే.. వాటన్నింటి కంటే ఇది ఎంతో ప్రత్యేకం. వాంఖడే గొప్ప స్టేడియం. దీనితో నాకు ఎన్నో గొప్ప జ్ఞాపకాలు ఉన్నాయి. గొప్ప ఆటగాళ్లు, రాజకీయ నేతల మధ్యలో నా పేరు ఉండటాన్ని నేను మాటల్లో చెప్పలేను. ఇందుకు ముంబయి క్రికెట్ సంఘానికి కృతజ్ఞతలు. నేను రెండు ఫార్మాట్ల నుంచి రిటైర్ అయ్యాను. ఇప్పటికీ ఇంకో ఫార్మాట్లో ఆడుతున్నాను. ఇక్కడికి 21న దిల్లీ క్యాపిటల్స్‌తో ముంబయి తరపున ఆడేందుకు వస్తున్నాను. అప్పుడు నాకు ప్రత్యేక అనుభూతి దక్కుతుంది"

"ఇక్కడ ఏ జట్టుతోనైనా టీమ్ఇండియా తరపున ఆడటం నాకు మరింత ప్రత్యేకంగా నిలవనుంది. ఈ గౌరవాన్ని నా కుటుంబసభ్యుల ముందు అందుకోవడం ఎంతో గొప్పగా ఉంది. నా జీవితంలోని ప్రతి ఒక్కరికీ.. వారు చేసిన త్యాగాలకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను" అని రోహిత్ పేర్కొన్నాడు.

వాంఖడే స్టేడియంలో సునీల్ గావస్కర్, సచిన్ తెందూల్కర్, వినూ మన్కడ్, దిలీప్ వెంగ్‌సర్కార్ల పేర్లతో స్టాండ్లు ఉన్నాయి. ఇప్పుడు రోహిత్ శర్మ, శరద్‌పవార్, అజిత్ వాడేకర్ పేరిట స్టాండ్లను ఆవిష్కరించారు.




## ఇక్కడి నుంచి పో..': సహనం కోల్పోయిన స్టార్క్.. వీడియో వైరల్

ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్, ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ మిచెల్ స్టార్క్ సహనం కోల్పోయాడు. "ఇక్కడి నుంచి వెళ్లిపో" అంటూ అభిమానిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. కాగా ఐపీఎల్2025 (IPL 2025) మెగా వేలంలో భాగంగా ఢిల్లీ స్టార్క్‌ను రూ. 11. 75 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. ఈ క్రమంలో ఈ సీజన్‌లో ఢిల్లీ తరపున పదకొండు మ్యాచ్‌లు ఆడి పద్నాలుగు వికెట్లు పడగొట్టాడు స్టార్క్. చివరగా పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా అతడు బరిలోకి దిగాడు. అయితే, భారత్ పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ధర్మశాలలో బ్లాక్ అవుట్ (విద్యుత్ సరఫరా నిలిపివేయడం) విధించడంతో పంజాబ్ ఢిల్లీ మ్యాచ్ అర్ధం తరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. భార్య అలిసా హేలీతో కలిసి ఈ నేపథ్యంలో బీసీసీఐ ఆటగాళ్లను వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించి.. ఆపై కట్టుదిట్టమైన భద్రత నడుమ ఢిల్లీకి చేర్చింది. ఈ పరిణామాలతో తీవ్ర భయాందోళనకు లోనైన స్టార్క్, అతడి భార్య అలిసా హేలీ ఢిల్లీకి చేరుకుని.. వెంటనే స్వదేశానికి పయనమయ్యారు. ఇక్కడి నుంచి పో.. ఈ క్రమంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తి స్టార్క్ దగ్గరగా వెళ్లి వీడియో తీసే ప్రయత్నం చేశాడు. దీంతో అతడు పక్కకు వెళ్లిపో అంటూ సైగ చేశాడు. అయితే, కాసేపటి తర్వాత సదరు వ్యక్తి మరోసారి స్టార్క్ దగ్గరికి వెళ్లి పలకరించాడు. దీంతో కోపోద్రిక్తుడైన ఆసీస్ బౌలర్.. "పో.. పో.. ఇక్కడి నుంచి దూరంగా వెళ్లిపో" అన్నట్లుగా విసుక్కున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ క్రమంలో చాలా మంది స్టార్క్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. అసలే భయపడిన వాడిని మరింత భయపెట్టడం సరికాదంటూ సెటైర్లు వేస్తుండగా... మరికొందరు మాత్రం స్టార్క్ అంతలా విసుక్కోవాల్సిన అవసరం లేదని.. ఏదేమైనా ఒకరి గోప్యతకు భంగం వాటిల్లేలా ప్రవర్తించడం ఏమిటని సదరు వ్లాగర్‌కు చివాట్లు పెడుతున్నారు. మే 17 నుంచి తిరిగి ప్రారంభం ఇదిలా ఉంటే... మే 17 నుంచి ఐపీఎల్2025 తిరిగి ప్రారంభం కానుంది. అయితే, ఢిల్లీకి ఆడుతున్న ఆసీస్ స్టార్లు స్టార్క్, జేక్ ఫ్రేజర్‌మెగర్క్ తిరిగి ఇండియాకు వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఇష్టమైతేనే భారత్‌కు తిరిగి వెళ్లవచ్చు అని క్రికెట్ ఆస్ట్రేలియా తమ ఆటగాళ్లకు సూచించగా.. స్వదేశంలోనే ఉండేందుకు వీరిద్దరు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఢిల్లీకి లీగ్ దశలో ఇంకో మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం పదకొండు మ్యాచ్‌లు పూర్తి చేసుకుని 13 పాయింట్లతో పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతున్న అక్షర్ సేన.. ప్లే ఆఫ్స్‌నకు గురిపెట్టింది. అయితే, స్టార్క్, మెగర్క్ వంటి కీలక ఆటగాళ్లు లేకపోవడం తీవ్ర ప్రభావం చూపనుంది.

## ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు ప్రకటన.. కెప్టెన్ ఎవరంటే? కరుణ్, కిషన్‌కు చోటు



**ఇంగ్లండ్ టూర్‌కు భారత-ఎ జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. ఈ జట్టు కెప్టెన్‌గా అభిమన్యు ఈశ్వరన్ నియమితుడయ్యాడు. ఈ టూర్‌లో ఈశ్వరన్ డిప్యూటీగా వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ వ్యవహరించనున్నాడు. కాగా ఇండియా-ఎ జట్టుకు చానాళ్ల తర్వాత వెటరన్ క్రికెటర్ కరుణ్ నాయర్ ఎంపికయ్యాడు. కరుణ్ 8 ఏళ్ల తర్వాత ఇండియా సీనియర్ టెస్టు జట్టులోకి సైతం రీ ఎంట్రీ ఇచ్చే సూచనలు కన్పిస్తున్నాయి.**

**ఇక కరుణ్ నాయర్‌తో పాటు ఇషాన్ కిషన్‌కు కూడా భారత-ఎ జట్టులో చోటు దక్కింది. అయితే ఆశ్చర్యకరంగా శ్రేయాస్ అయ్యర్‌ను సెలక్టర్లు పక్కన పెట్టారు. దీంతో అయ్యర్ ఇంగ్లండ్‌తో టెస్టులకు ప్రధాన భారత జట్టులో లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.**

**ఈ 18 మంది సభ్యుల జట్టులో భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్, నితీష్ కుమార్ రెడ్డి, తనుష్ కోటియన్, ముఖేష్ కుమార్, ఆకాష్ దీప్ కూడా ఉన్నారు. వారిని ప్రాక్టీస్ కోసం ముందుగా ఇంగ్లండ్‌కు బీసీసీఐ పంపింది. అదేవిదంగా ఐపీఎల్ ప్లే ఆఫ్స్ తర్వాత శుబ్‌మన్ గిల్, సాయిసుదర్శన్‌లు ఇండియా-ఎ జట్టుతో కలవనున్నట్లు బీసీసీఐ ఓ ప్రకటనలో పేర్కొంది.**

### వికెట్ల వీరుడికు చోటు

**ఈ ఏడాది రంజీ ట్రోఫీ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్ హర్ష్ దుబే కూడా భారత-ఎ జట్టులో భాగమయ్యాడు. ఈ విదర్భ స్పిన్నర్ 10 మ్యాచ్‌ల్లో 17 సగటుతో 69 వికెట్లు పడగొట్టాడు. మరో ఎడమచేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. కాగా ప్రధాన సిరీస్‌కు ముందు ఇండియా-ఎ జట్టు ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌లు మే 30 నుండి జూన్ 9 వరకు జరగనున్నాయి.**

### ఇంగ్లండ్ పర్యటనకు భారత్ ఎ జట్టు:

**అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, ధృవ్ జురెల్ (వైస్ కెప్టెన్), నితీష్ కుమార్ రెడ్డి, శార్దూల్ ఠాకూర్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), మానవ్ సుతార్, తనుష్ కోటియన్, ముఖేష్ కుమార్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా, అన్షుల్ కాంబోజ్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, సర్ఫరాజ్ ఖాన్, తుషార్ దేశ్‌పాండే, హర్ష్ దూబే**

## విరాట్ కోహ్లీ నాకు మద్దతుగా నిలిచాడు: రజత్ పటీదార్






రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తాను ఒత్తిడికి గురయ్యానని రజత్ పటీదార్ అన్నాడు. ఆ సమయంలో తనకు విరాట్ కోహ్లీ మద్దతుగా నిలిచాడని ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో వివరించాడు. విరాట్ కోహ్లీనుంచి తనకు లభించిన ప్రోత్సాహాన్ని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పటీదార్ ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో వివరించాడు. డుప్లెసిస్‌ను జట్టు మెగావేలంలో వదులుకున్న తర్వాత రజత్ పటీదార్‌ను కెప్టెన్‌గా నియమించింది. అప్పుడు తాను తీవ్ర ఒత్తిడికి గురైనట్లు చెప్పాడు. ఆ సమయంలో తనను విరాట్ కోహ్లీ వెన్నుతట్టి ప్రోత్సహించి, తనకు ఎంతో మద్దతుగా నిలిచాడన్నాడు. "నేను టీవీ వీక్షించడం ప్రారంభించినప్పటి నుంచి విరాట్ కోహ్లీని ఐపీఎల్‌లో, భారత క్రికెట్ జట్టులోచూస్తూనే ఉన్నాను. అతడు చాలా సంవత్సరాలు ఆర్సీబీకి కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతడి నుంచి నేను సారథ్య బాధ్యతలు స్వీకరించినప్పుడు ఒకింత ఆందోళనకు గురయ్యా. కానీ, అప్పుడు అతడు 'నువ్వు కెప్టెన్సీకి అర్హుడివి. నువ్వు దీన్ని సాధించుకున్నావు' అన్నాడు. ఆ మాటలతో నాలో కాస్త ధైర్యం వచ్చింది. నేను విరాట్ కోహ్లీ నుంచి ఎంత వీలైతే అంత నేర్చుకున్నా. అతడు నన్ను చాలామంది అభిమానులకు పరిచయం చేశాడు. అది నాకు ప్రత్యేకమైన క్షణం" అని రజత్ పటీదార్ తనకు విరాట్ కోహ్లీతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నాడు. రజత్ పటీదార్ సారథ్యంలోని ఆర్సీబీ ప్రస్తుత ఐపీఎల్‌లో 16 పాయింట్లు సాధించింది. ప్లేఆఫ్స్‌నకు చేరుకోవడానికి అడుగు దూరంలో ఉంది. పటీదార్ ఈ ఐపీఎల్ సీజన్‌లో 239 పరుగులు చేశాడు. సారథిగానూ జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. కానీ అతడి ముందు మరి కొన్ని సవాళ్లున్నాయి. మే 17 నుంచి ఐపీఎల్ పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆర్సీబీ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్ , సన్‌రైజర్స్ హైదరాబాద్ , లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో తలపడాల్సి ఉంది. వీటిలో విజయాలే బెంగళూరు ప్లేఆఫ్స్‌ను నిర్ణయించనున్నాయి. రజత్ పటీదార్‌కు ఇంతకుముందు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవమూ ఉంది. దీంతో ఈ సారి ఆర్సీబీ తేలికగానే ప్లేఆఫ్స్‌నకు చేరుకుంటుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.